క్లుప్తంగా

నాణ్యమైన విద్య అందించాలి

కన్నాయిగూడెం: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జీసీడీఓ రమాదేవి అన్నారు. మండలంలోని ముప్పనపల్లిలో ఉన్న కేజీబీవీని జీసీడీఓ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను వంట గదిని పరిశీలించారు. మెనూ ప్రాకారం ఆహారం అందించాలని, పాఠశాల ఆవరణలో పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

సన్మానం



ఎస్ఎస్‌తాడ్వాయి: తాడ్వాయి రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసిన సురేష్‌బాబును ఇటీవల తహసీల్దార్‌గా నియమించారు. దీంతో తహసీల్దార్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దేవేందర్, జాతర చైర్మన్ లచ్చుపటేల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, మాజీ సర్పంచులు ఇర్ప సునీల్‌దొర, నరసింహస్వామి, నాయకులు నరేష్ పాల్గొన్నారు.

ఫ్రీజర్ అందజేత



మంగపేట: మండలంలోని మల్లూరు గ్రామానికి చెందిన కుంచనపెల్లి అక్కయ్య నాయుడు, వెంకాయమ్మ జ్ఞాపకార్థం వారి మనువడు అశోక్ గ్రామ పంచాయతీకి గురువారం బాడీ ఫ్రీజర్‌ను అందజేశారు. పంచాయతీ స్పెషలాఫీసర్ తెల్లం విజయలక్ష్మి, సాయిని నర్సింహారావు, రామక్రిష్ణ, యాలం కాంతారావు, సత్యనారాయణ, ముకుందం, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



ములుగు రూరల్: యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించగా ముఖ్య అతిథిగా డాక్టర్ జగదీశ్ హాజరై మాట్లాడారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ రక్తదాన శిబిరం నిర్వహించడం సంతోషించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు రవీందర్, రంజీత్, నవీన్, రాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు రవితేజ, రవి, బలేశ్వర్, రాకేష్, చరణ్, నరేష్ పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ సమస్య పరిష్కారం'

గోవిందరావుపేట: ఎస్సీ వర్గీకరణ సమస్యను సీఎం రేవంత్ రెడ్డి పరిష్కరించినట్లు కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గణపాక సుధాకర్ తెలిపారు. మండల కేంద్రంలో పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పడిదల సాంబయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో సంఘాలు ఉద్యమాలు చేసి ప్రాణాలను సైతం త్యాగం చేశారని అన్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారిన ఎస్సీ కులాలకు జరిగిన అన్యాయాలకు ఎవరు కూడా స్పందించలేదని అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో పాస్ చేసినందుకు మంత్రివర్గానికి, సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ యావత్తు ఎస్సీ వర్గ ప్రజానీకం రుణపడి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గోపిదాసు ఏడుకొండలు, పాలెం యాదగిరి, రాజబాబు, శ్రీను, లుకాస్, రతన్, వెంకటేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన సరికొప్పుల మొండయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు నాయకులతో కలిసి పరామర్శించారు. ప్రదీప్‌రావు, సునీల్‌కుమార్, మెర్గు వెంకటేశం, భాస్కర్ రావు, నర్సయ్య ఉన్నారు.

గోవిందరావుపేట: మండలంలోని పస్రా గ్రామానికి చెందిన అంబాల పోషాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు గురువారం పరామర్శించారు. ఆయన వెంట తుమ్మల హరిబాబు, పోరిక గోవింద్ నాయక్, సూడి శ్రీనివాస్ రెడ్డి, ప్రదీప్ రావు, స్వరూప, చంద్‌లాల్, సాంబయ్య, గట్టయ్య, మురళి, రమేశ్, వెంకన్న, ఎలేందర్, ఫక్రుద్దీన్, కనకయ్య, పురుషోత్తం, సారయ్య, హరిసింగ్, కొమురయ్య, మల్లేశ్, మోహన్, శ్రీనావాస్ ఉన్నారు.

సైడ్‌బర్మ్‌లు మరిచారా?



ఒకవైపు ఎత్తు, మరో వైపు తక్కువగా ఉన్న రోడ్డు



సైడ్ బర్మ్ లేని సీసీ రోడ్డు

- వాహనదారులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ఏటూరునాగారం: మండలంలోని శంకరాజుపల్లి గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లకు ఇరువైపులా సైడ్ బర్మ్‌లు లేక ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీరాజ్, ఇంజనీరింగ్‌శాఖ ద్వారా నిర్మించిన సీసీ రోడ్లు పూర్తి చేసిన కాంట్రాక్టర్ సైడ్ బర్మ్స్ పోయకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలకు సైడ్ ఇవ్వలేక, కిందకు దిగలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అంతే కాకుండా ఒక రోడ్డు ఎత్తు తక్కువ, మరో రోడ్డు ఎత్తు ఎక్కువగా నిర్మించడంతో వాహనాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. ఈ విషయంపై పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించి సీసీ రోడ్లకు సైడ్ బర్మ్‌లు నిర్మించి వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కిందకు దిగలేని పరిస్థితి..



రొయ్యూర్, శంకరాజుపల్లిలోని పలు సీసీ రోడ్లు సైడ్ బర్మ్‌లు లేక రోడ్లు అధ్వానంగా మారాయి. ఎదురెదురుగా వాహనాలు వస్తే కిందకు దిగలేని పరిస్థితి. అధికారులు సైడ్ బర్మ్స్ నిర్మించి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలి.

- శ్రీనివాస్, రొయ్యూర్, ఏటూరునాగారం

ఇబ్బందులు తొలగించాలి



రోడ్లు నిర్మిస్తున్నారు కానీ సైడ్ బర్మ్‌లు లేక వాహనదారులు కిందపడి పోతున్నారు. దీంతో గాయాలై ఆస్పత్రి పాలవుతున్నారు. రోడ్ల నిర్మాణం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సీసీ రోడ్లు నిర్మించిన వెంటనే సైడ్ బర్మ్‌లు నిర్మించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి.

- వినుకోలు చక్రవర్తి, ఏటూరునాగారం

యువజనోత్సవాల్లో భాగస్వాములు కావాలి

- వరంగల్ నెహ్రూ యువకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్

ఏటూరునాగారం: ఈనెల 25న జిల్లాలోని ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న యువజన ఉత్సవ కార్యక్రమంలో యువత భాగస్వాములు కావాలని వరంగల్ నెహ్రూ యువకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువజనోత్సవాల వాల్ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువజనోత్సవాల కార్యక్రమంలో యంగ్ రైటర్స్, యంగ్ ఆర్టిస్టులు, ఫొటోగ్రఫీ, ఉపన్యాసం, జానపద నృత్యం, సైనుస్ ఎగ్జిబిషన్‌లతో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంచ ప్రాన్ అనే అంశంపై ఈ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన వారికి మొదటి, రెండో, మూడో నగదు బహుమతితో పాటు ప్రశంస పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9908069469 ,9502449469లలో సంప్రదించాలని కోరారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అన్వేష్

ఒకే దేశం.. ఒకే ఎన్నిక విధానంతో అభివృద్ధి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం

ఎస్ఎస్‌తాడ్వాయి: ఒకే దేశం ఒకే ఎన్నిక విధానంతో దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. మండల పరిధిలోని మేడారంలో మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ విధానం ద్వారా ఎన్నికలపై ఎన్నికల కమిషన్‌కి ఖర్చు తగ్గుతుందన్నారు. మోడీ పరిపాలన అభివృద్ధి పథంలో ముందుకెళ్తుందని తద్వారా దేశం రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ విషయంపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీమంతుల రవీంద్ర చారి, భర్తపురం నరేష్, అసెంబ్లీ కన్వీనర్ జాడి వెంకట్, గోవిందరావు పేట మండల అధ్యక్షుడు మార్క సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బలరాం

అభివృద్ధిని ఓర్వలేకనే ఆరోపణలు

- పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభినయ్‌చారి

ములుగు: జిల్లాలో మంత్రి సీతక్క చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీజేపీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రేసోజు అభినయ్‌చారి అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి సీతక్క చొరవతో ములుగులో అత్యాధునిక పద్ధతిలో బస్టాండ్ నిర్మాణం జరగనుందని అన్నారు. టెండర్ వేయడం, డిజైన్ పరిశీలన పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రక్రియకు కొంచెం సమయంపట్టే అవకాశం ఉందనేది గమనించాలని అన్నారు. బస్టాండ్ ఆవరణలో పోచమ్మ గుడిని లేకుండా చేస్తున్నారనేది అవాస్తవ ప్రచారం అని, శివరాత్రి రోజు భక్తుల ముందే గుడిని తొలగించకుండా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పిన మాటలు బీజేపీ నాయకుల చెవినపడలేదా అన్ని ప్రశ్నించారు. సందీప్, సాయి, అతీఫ్, రఫీద్, హేమంత్, రోహిత్, సంజీవ్, పవన్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అభినయ్

వనదేవతకు ఘనంగా ఎదుర్కోలు



మొక్కులు చెల్లించుకుంటున్న గ్రామ పెద్దలు



ఎదుర్కోలు నిర్వహిస్తున్న పూజారులు, భక్తులు

మంగపేట: మండలంలోని నిమ్మగూడెం పంచాయతీ పరిధిలోని తిమ్మాపురంలో కొమురంవారి వంశస్తుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న గుట్ట ముసలమ్మ(సమ్మక్క–సారమల్మ) జాతర మూడో రోజు గురువారం ఎదుర్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ సమీపంలోని ఉన్న ముసలమ్మ గుట్టపై ఆదివాసీ పూజారులు, వడ్డెలు ఆదివాసీ గిరిజన రహస్య పూజలు నిర్వహించి వనదేవత(కంకవనం) వనాన్ని గ్రామ పొలిమేరలోకి తీసుకునివచ్చారు. ఆదివాసీ గిరిజనుల ఆచారం ప్రకారం గుట్ట ముసలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వనదేవతకు ఎదుర్కోలు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముసలమ్మ ఆలయం దేవర బాల(పూజారి) కొమురం రామయ్య, కొమరం వంశస్తుల ఇలవేల్పు రెక్కల రామక్క ట్రస్టు బోర్డు చైర్మన్ కొమరం రాంమ్మూర్తి, గ్రామ పెద్దలు కొమురం రామకృష్ణ, కొమురం సారయ్య, కొమురం నాగేశ్వర్ రావు, రేశ నర్సింగరావు, కొమురం బాలయ్య, నర్సయ్యటీచర్, బొర్రయ్య, వెంకటేశ్వర్లు, బాబు, డాక్టర్ మహేందర్, కొమురంభీం యూత్ సభ్యులు కొమురం వాసు, రవి, గణేష్, బాలకృష్ణ, మధు, మహిపాల్, పోలెబోయిన విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు

కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడెం, కన్నాయిగూడెంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు గురువారం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎండల నేపథ్యంలో ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ప్రజలు చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్హుల ఎంపికకు పెసా గ్రామసభలు

వాజేడు: షెడ్యూల్ తెగ ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌టీఎస్‌డీఎఫ్) పథకం కింద బోర్ల మంజూరుకు అర్హుల ఎంపిక కోసం ఈ నెల 24, 25న గ్రామ పంచాయతీల వారీగా పెసా గ్రామ సభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయ గురువారం తెలిపారు. ఈ నెల 24న అయ్యవారిపేట, ధర్మవరం, చంద్రుపట్ల, చీకుపల్లి, చెరుకూరు, చింతూరు, దూలాపురం, ఏడ్జెర్లపల్లి, నాగారం, గ్రామపంచాయతీల్లో, 25 న గుమ్మడిదొడ్డి, టేకులగూడెం, పెద్ద గొళ్ల గూడెం, శ్రీరామ్‌నగర్, పేరూరు, కొత్త టేకులగూడెం, పూసూరు, కొంగాల, మొరుమూరు, కృష్ణాపురం గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు ఉదయం 9 గంటలకు నిర్వహిస్తామని వెల్లడించారు.

బియ్యం, నగదు అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని కాటాపూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చిరంజీవి తల్లి రాజలక్ష్మి ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని పార్టీ మండల అధ్యక్షుడు దేవేందర్ నాయకులతో కలిసి పరామర్శించి క్వింటా బియ్యం, రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. మేడారం జాతర చైర్మన్ లచ్చు పటేల్, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎండీ ముజాఫర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, మాజీ సర్పంచ్‌లు బెజ్జూరి శ్రీనివాస్, మంకిడి నరసింహస్వామి, నాయకులు పల్నాటి సత్యం, మంకిడి నర్సయ్య, మధు పాల్గొన్నారు.

బొగ్గుల వాగుపై ఆనకట్ట నిర్మించాలి

- రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంజాద్ పాషా

ములుగు రూరల్: బొగ్గుల వాగుపైన ఆనకట్ట నిర్మించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజాద్ పాషా అన్నారు. గురువారం మండలంలోని రామయ్యపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ములుగు మండలంలోని ఒక పంట సాగు నీరుకు కూడా నమ్మకం లేదన్నారు. జగ్గన్నగూడెం, లాలై గూడెం గ్రామాల మధ్య బొగ్గుల వాగుపైన ఆనకట్ట నిర్మిస్తే కొత్తగూడెం మండలానికి రోడ్డు సౌకర్యంతో పాటు మండలంలోని 25 గ్రామాలకు సుమారుగా 10 వేల ఎకరాల పంటకు సాగునీరు అందించవచ్చు అని అన్నారు. లక్నవరం ముంపు గ్రామాలకు ఎస్సారెస్పీ కాలువ ద్వారా సాగునీరు అందించాలని అన్నారు. అనంతరం గ్రామ రైతు కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వాంకుడోత్ వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా రాజు, ఉపాధ్యక్షులుగా రాములు, లావుడ్య సాజన్, సహాయ కార్యదర్శిగా జగన్, కమిటీ సభ్యులుగా శంకర్, బద్రు, లచ్చిరాం, జోహార్, బాలు తదితరులను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న అంజాద్ పాషా

ఉచితంగా కంటి పరీక్షలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన శంకర్ కంటి వైద్యశాలకు చెందిన వైద్యులు, స్థానిక ఆప్తాల్మిక్ రాహుల్ కలిసి 150 మందికి కంటి పరీక్షలు చేశారు. అందులో 38 మందికి సర్జరీ అవసరం ఉండడంతో శంకర్ ఐ ఆస్పత్రి వారు ఉచిత బస్సు ఏర్పాటు చేసి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించి మళ్లీ ఇక్కడ దింపేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కోశాధికారి వెంకట్రావు, కార్యదర్శి బచ్చు సతీష్, దేవాలయం అర్చకులు భానుప్రకాశ్ శర్మ, అటిక సతీష్, శంకర్ ఐ ఆస్పత్రి బృందం పార్వతి, నిరూపమా, దివ్య, జాస్పర్, విజయ్, రాహుల్ పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



వాజేడు: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



మంగపేటలో..

వాజేడు: మండలంలోని ధర్మారం గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లె డెనార్జునరావు ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డెనార్జునరావు మాట్లాడుతూ.. అసెంబ్లీలో బీసీ బిల్లు ప్రవేశపెట్టి 42 శాతం రిజర్వేషన్ కల్పించడం హర్షనీయమన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పూనెం రాంబాబు, సర్వేశ్వరరావు, రాంబాబు, మురహరి, నర్సింహచారి, రమేశ్, దేవేంద్ర మూర్తి, కృష్ణ, భాస్కర్, రమణయ్య, సత్యం, రాజబాబు, సత్యనారాయణ, రాము తదితరులు ఉన్నారు.

మంగపేట: అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బీసీ బిల్లుకు ఆమోద తెలుపడంపై హర్షం వ్యక్తం చేస్తు కాంగ్రెస్ పార్టీ బీసీసెల్ మండల అధ్యక్షుడు ముత్తినేని ఆదినారాయణ ఆధ్వర్యంలో గురువారం సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి సీతక్క చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు మందుల పంపిణీ

వాజేడు: మండల పరిధిలోని ధర్మవరం ఆరోగ్య ఉప కేంద్రంలో గురువారం పిల్లలకు రక్త హీనత నివారణ మందులను అందించారు. ఈ సందర్భంగా హెచ్ఈఓ వేణుగోపాల్ కృష్ణ మాట్లాడుతూ.. 6 నెలల నుంచి 5 సంవత్సరాలు ఉన్న వారికి టానిక్ రూపంలో వారానికి రెండు సార్లు, 5 నుంచి 9 సంవత్సరాల వారికి గులాబి రంగు ఐరన్ మాత్రలను వారానికి ఒక సారి ఇవ్వాలన్నారు. 10 నుంచి 19 సంవత్సరాలు ఉన్న వారికి నీలం రంగు మాత్రలను వారానికి ఒకసారి ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు శ్రీదేవి, శారద ఉన్నారు.



ఐరన్ టానిక్ తాగిస్తున్న వైద్య సిబ్బంది

వివాహిత ఆత్మహత్య

కన్నాయిగూడెం: మండలంలోని తుపాకులగూడెంలోని ఏహెచ్ఎస్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సోలం కృష్ణ భార్య సరిత (30) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై వెంకటేశ్ తెలిపిన కథనం ప్రకారం.. కొత్తగూడ గంగారానికి చెందిన సోలం కృష్ణ మండలంలోని తుపాకులగూడెం గ్రామంలో ఏహెచ్ఎస్ పాఠశాలలో గత కొంత కాలంగా ఉపాధ్యాయుడిగా పని చేస్తు ఇక్కడే కుటుంబంతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి సరితకు, కృష్ణకు కుటుంబంలో గొడవ జరగడంతో సరిత మనస్థాపానికి గురై పురుగుల మందు తాగింది. గమనించిన కృష్ణ తోటి వారి సహకారంతో 108లో ఏటూరునాగారం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అంతలోనే సరిత ఆరోగ్యం విషమించి మృతి చెందినట్లు తెలిపారు. వీరికి 2014లో వివాహం కాగా ఒక బాబు ఉన్నాడు. మృతురాలి తల్లి సాగబోయిన రామక్క ఫిర్యాదుతో కేసు నమోదు చసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



గోవిందరావుపేట: పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు



ఎస్ఎస్ తాడ్వాయిలో..



ఏటూరునాగారం: మాట్లాడుతున్న ఎంఈఓ

వాజేడు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నేటి(శుక్రవారం) నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. మండలంలో మొత్తం 123 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు వెల్లడించారు.

పరీక్షలకు పటిష్ట బందోబస్తు

గోవిందరావుపేట: పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సీఐ రవీందర్, ఎస్సై కమలాకర్ అన్నారు. మండలంలోని పరీక్ష కేంద్రాలను వారు గురువారం సందర్శించి మాట్లాడారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్స్, ఇంటర్ నెట్ సెంటర్స్, చుట్టుపక్కలా లౌడ్ స్పీకర్స్ మూసి వేయాలని అన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన


వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేందాలను మండల తహసీల్దార్ లక్ష్మీరాజయ్య పరిశీలించారు. తాగు నీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు పరీక్ష కేంద్రలో ఉన్నది లేనిది పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ సత్యనారాయణ, ఉపాధ్యాయులు జయరామ్, బొల్లే శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని మేడారం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో, తాడ్వాయి మండల కేంద్రంలోని ఇందిరానగర్ జెడ్పీ పాఠశాలలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో 268 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ రేగ కేశవరావు తెలిపారు. రెండు పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు బెంచీలు, ఫ్యాన్లు, తాగునీటి వసతి ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష కేంద్రాలను తాడ్వాయి ట్రైనీ ఎస్సై జగదీశ్వర్‌రెడ్డి సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం: నిబంధనల ప్రకారం ఇన్విజిలేటర్లు డ్యూటీ చేయాలని ఎంఈఓ మల్లయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌లో పదో తరగతి పరీక్షల ఇన్విజిలేటర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఏటూరునాగారం జెడ్పీహెచ్ఎస్ ఏ సెంటర్‌లో 126 మంది విద్యార్థులు, బీ సెంటర్‌లో 140 మంది, క్రాస్‌రోడ్డులోని స్పోర్ట్స్ స్కూల్‌లో 140 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

భయం లేకుండా పరీక్షలు రాయాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: విద్యార్థినులు భయపడకుండా పదో తరగతి పరీక్షలు రాయాలని పాఠశాల పీజీ హెచ్ఎం కల్తి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని ఊరట్టం గ్రామానికి చెందిన చర్పా జగన్నాతరావు జ్ఞాపకార్థం ఆయన తనయుడు నేతాజీ ఆ గ్రామంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలోని పదోతరగతి విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, స్టడీ మెటీరియల్ పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు.



పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న హెచ్ఎం శ్రీనివాస్